ప్రజాశక్తి

బుధవారం 19 మార్చి 2025

5



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

పన్నులు వసూళ్లు చేయండి

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, మొండి బకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయాలని, లేని పక్షంలో ఆస్తులను జప్తు చేయాలని కమిషనర్ సూర్యతేజ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను బకాయిదారులు ఈ నెల చివరిలోపు బకాయిలు మొత్తం చెల్లించేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ సూపరింటెండెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

ప్రజలకు అందుబాటులో పార్కులు

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో పిల్లల ఆట వస్తువులు,జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ మంగళవారం 6వ డివిజన్ పప్పుల వీధి, శెట్టి గుంట రోడ్డు, జీగేల వీధి తదితర ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా పప్పుల వీధి ప్రజా పార్కును కమిషనర్ సందర్శించి పార్కులో పచ్చదనం, ఆట వస్తువులు, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి పెయింటింగ్ పనులను చేపట్టాలని ఆదేశించారు. డ్రైను కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా పూర్తి చేయాలని, మురుగు కాలువలలో సిల్ట్ తీసిన వెంటనే రోడ్లపై ఉంచకుండా మురుగు తొలగించేలా చర్యలు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. రోడ్లపై నిరుపయోగంగా నిలిపి ఉన్న వాహనాలను తొలగించేలా పోలీస్ విభాగం వారికి సమాచారం అందించి ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై ఉన్న సి అండ్ డి వేస్ట్,ఆక్రమణలు వెంటనే తొలగించవలసిందిగా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణములో భాగంగా రోడ్లపై, కాలువలలో నిర్మాణ సామాగ్రిని వేసి నీటిపారుదలకు అంతరాయం కలిగించే భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, ఎస్.ఇ. రామ్ మోహన్ రావు, ప్రవీణ్ కుమార్, డాక్టర్ మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మాకు ఫోన్లు వద్దు.. ట్యాబ్‌లు ఇప్పించండి

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రభుత్వం అందజేసిన ఫోన్‌లలో స్టోరేజీ తక్కువగా ఉండటం వల్ల తమకు నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేయలేక తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవు తున్నామని, అనుకూలమైన ట్యాబ్‌లు పంపిణీ చేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసిడిఎస్ పిడి కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. మంగళవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి షేక్ రెహానాబేగం మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం అందజేసిన 2 జిబి ర్యాం సెల్‌ఫోన్ సక్రమంగా పనిచేయడం లేదని, ప్రభుత్వం అంగన్‌వాడీలకు నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేయలేక తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురౌతున్నారన్నారు. ఈ సమస్యనుంచి అంగన్‌వాడీలకు విముక్తి కలిగించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అనుకూలమైన ట్యాబులు అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ధర్నా కార్యక్రమానికి సిఐటియు నాయకులు పి. పెంచలనర్సయ్య, కొండా ప్రసాద్ తదితరులు హాజరై తమ సంఘీభావం తెలియజేశారు. అనంతరం ఐసిడిఎస్ పిడికి అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే సిపిఎం లక్ష్యం

ప్రజాశక్తి-నెల్లూరు: ప్రతి క్షణం ప్రజాపక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే సిపిఎం ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రూరల్ నియోజకవర్గ పరిధిలో ప్రజాచైతన్య యాత్రలు చేపట్టిన సమయంలో అనేక సమస్యలను ప్రజలు తమ వద్దకు తీసుకొచ్చారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అన్నారు. సమస్యలకు పరిష్కారం లభించకపోతే ప్రజల సహకారంతో ఒక ప్రణాళిక బద్ధంగా ఉద్యమాలు, పోరాటాలు నిర్వహి ంచి సాధించుకుంటామన్నారు. మంగళ వారం వేదాయపాళెం ప్రాంతంలోని మన్సూర్ భవన్ (సిపిఎం రూరల్ కార్యాలయం)లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం రూరల్ 4వ మహాసభలు నిర్వహించుకున్నామన్నారు. ఈ మహాసభల్లో నూతనంగా 21 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటైందని, ఈ కమిటీ కార్యదర్శిగా కొండా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ నెల 8వ తేది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తు న్నామన్నారు. రూరల్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చా రన్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ చింతారెడ్డి పాళెం ప్రాంతంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని,గొలగమూడి క్రాస్ రోడ్డు, బుజబుజనెల్లూరు ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బుజబుజనెల్లూరు ప్రాంతంలో సర్వీస్ రోడ్డు నిర్మాంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రూరల్ కమిటీ నాయకులు కె. పెంచలనర్సయ్య, డి.సంపత్‌కుమార్, కట్టా సతీష్, ఎస్‌కె షాహీనా బేగం, ఎస్‌డి రఫీ అహ్మద్, బి.నాగేశ్వరరావు, ఎన్.మాలకొండయ్య, ఎస్‌కె ఖలీల్, ఎస్‌కె షంషాద్, ఒంగోలు సుధీర్, పోతురాజు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు

అత్యాచారాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ఎస్‌సి, ఎస్‌టిలపై వివక్ష, హింస, అణచివేత వంటి అమానుష చర్యలను నిరోధించేందుకు ఉద్దేశించిన చట్టాన్ని జిల్లాలో కఠినంగా అమలుచేయాలని కలెక్టర్ ఒ ఆనంద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎస్‌పి జి. కృష్ణకాంత్ తో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి విజిలెన్స్ ,పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా కమిటీ సభ్యులు మురళీ కృష్ణ యాదవ్, ప్రవల్లిక, శ్రీరాములు, ప్రభాకర్, సాయి ప్రసాద్, మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గహాలు శిధిలావస్థలో ఉన్నాయని, వాటిని పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లోని పిల్లల చేత పనులు చేయిస్తున్నారన్నారు. గతంలో బుచ్చి వసతి గృహంలో జరిగిన అవకతవకలపై చర్యలు లేవని, నగరంలో అంబేద్కర్ భవన్ నిర్మాణం పురోగతిలో లేదన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఏదైనా సమస్యపై కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్ కు వెళితే ఆయా కేసుల వివరాలు అందించడం లేదన్నారు. కేసులను వాదించటంలో పబ్లిక్ ప్రాసెక్యూటర్ సరిగా స్పందించే విదంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా స్థాయి విజిలెన్స్ ,పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకొకసారి తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ పూజ, డిఆర్‌ఒ ఉదయభాస్కర్ రావు, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి, ఆర్‌డిఒలు సన్నీ వంశీకృష్ణ, అనూష, పోలీసు అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఒ ఆనంద్

భోజనం చేస్తున్న పేదలు

అన్నా క్యాంటీన్‌లో ఉచిత భోజనాలు

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని అన్న క్యాంటీన్లో మంగళవారం 20 వార్డుకు చెందిన వడ్లమూడి చెంచు నారాయణ వారి సతీమణి విజయలక్ష్మిల మనవడు వెంకట మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా అన్నా క్యాంటీన్లో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాంతో పాటు కేక్ కటింగ్ కూడా చేశారు.ఈ సందర్భంగా పలువురికి అన్నదానం చేశారు.

కోడూరు బీచ్‌లో షూటింగ్ సందడి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని కొత్త కోడూరు బీచ్ తీరంలోని వేళాంగిణి మాత ఆలయం పరిసర ప్రాంతాలలో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. చిత్ర యూనిట్ భక్తి సంబంధమైన "అసుర సంహారం" సినిమా చిత్రీకరణ చేపట్టారు. ఈ చిత్రంలో ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి ముఖ్య పాత్ర పోషిస్తున్నారని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా చిత్రం నిర్వాహకులు మాట్లాడుతూ "అసుర సంహారం" చిత్రీకరణ ప్రధాన ఘట్టాలు నెల్లూరు జిల్లా సముద్ర తీర ప్రాంతాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతం బ్యాక్ డ్రాప్‌గా సాగే చిత్రం కావడంతో నెల రోజుల పాటు సముద్ర తీర పరిసర ప్రాంతాలో చిత్ర నిర్మాణం జ రుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ సినిమా చిత్రీకరణ చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. దాంతో కోడూరు సముద్ర తీర ప్రాంతం ప్రజలతో కిక్కిరిసింది. పండుగ వాతావరణం నెలకొంది.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-నెల్లూరు: ఈనెల 12వ తేదీన రాష్ట్రస్థాయి కరాటే స్వే మార్షల్ ఆర్ట్స్ పోటీలలో పాల్గొని ప్రతిభను కనపరిచిన విద్యార్థులను కమిషనర్ సూర్యతేజ అభినందించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ పోటీలకు అండర్ 14, అండర్ 11, అండర్ 8, అండర్ 10, క్యాటగిరిలో సుమారు 600 మంది విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు. ఏసీ నగర్ శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 11 మంది గోల్డ్ మెడల్ ను సాధిం చారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య ఏజీఎం శ్రీకాంత్, ప్రిన్సిపల్ కె రెడ్డి ప్రవీణ్, స్వై మార్షల్ ఆర్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ ఇబ్రహీం షేక్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

పక్కా ప్లాన్‌తోనే రౌడీ షీటర్ హత్య
-ఆరుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు: స్థానిక పొదలకూరు రోడ్డు, జెడ్‌పి హైస్కూల్ ప్రాంతంలో ఇటీవల చోటు చేసుకున్న రౌడీషీటర్ సుజన్ కృష్ణారెడ్డి అలియాస్ చింటూ హత్య పక్కా ప్లాన్ ప్రకారం చోటు చేసుకుందని నగర డిఎస్‌పి సింధుప్రియ వెల్లడించారు. మంగళవారం వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హత్య చేసే సమయంలో నిందితులు వినియోగించిన మారణాయుదాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. మృతుడు సుజన్ కృష్ణారెడ్డి అలియాస్ చింటూకు నిందితుడు శివకుమార్ కృష్ణసాయి అలియాస్ కిట్టుకు మధ్య ఏర్పడిన చిన్నపాటి మనస్పర్ధల కారణంగా ఈ హత్య చోటు చేసుకుందని పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు. ఇటీవల కాలంలో ఒక రోజు సుజన్ కృష్ణారెడ్డి కృష్ణసాయి ఇంటి వెళ్లి ఘర్షణ పడటంతోపాటు 'నిన్నూ.. నీ స్నేహితులను' చంపితీరుతానని బెదిరించాడని, దీనిని అవమానంగా బావించిన శివకుమార్ కృష్ణసాయి అలియాస్ కిట్టు మిగిలిన వారితో కలిసి చింటూను హత్య చేసేందుకు పక్కా ప్లాన్ వేసుకున్నారన్నారు. ఈ క్రమంలో ఓ అమ్మాయి వ్యవహారం మాట్లాడాలని నమ్మబలికి పొదలకూరు రోడ్డు ప్రాంతానికి పిలిపించి ఆరు మంది నిందితులు కత్తులతో దాడి చేసి హత్య చేసి ఘటనా స్థలం నుంచి పారిపోయారన్నారు. కుమారుడు హత్యకు గురైనట్లు మృతుడి తల్లి వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు.

బాలికల చేత వెట్టి చాకిరి తగదు

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని బాలికాసదన్‌లో బాలికల చేత వెట్టి చాకిరి చేయిస్తున్న ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో ఎఐవైఎఫ్ ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని నాయకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. బాలిక సదనంలో ఉన్న ఉద్యోగులపై పలుమార్లు ఫిర్యాదులు అందిన ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడం సరికాదని వారు హెచ్చరించారు. మంగళవారం ఒక ప్రముఖ పత్రిక ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు నెల్లూరు నుండి జిల్లా అధికారులు వచ్చి బాలికాసదన్‌లో మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా అధికారులతో బాలికాసదన్ ఉద్యోగులు మంతనాలు జరిపారని సమాచారం అందిందని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు బాలికాసదన్‌కి వెళ్లిన లోనికి అనుమతించకుండా ఏమైనా ఉంటే ఐసిడిఎస్ కార్యాలయానికి రావాలని చెప్పడంతో పలు అనుమానాలకు దారితీస్తుందని వారు ఆరోపించారు. బాలికల చేత వెట్టిచాకిరి చేపిస్తున్న వారిని వెంటనే సస్పెండ్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ధర్నా చేపట్టడం జరుగుతుందని వారు హెచ్చరించారు.. వెట్టిచాకిరి చేపిస్తున్న వారిపై చర్యలు తీసుకునేంతవరకు మరింత కార్యాచరణ రూపొందించుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రకటన ఇచ్చిన వారిలో ఏఐఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏఐఎస్ఎఫ్ ప్రకాశం జిల్లా నాయకులు పవన్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు యర్రంశెట్టి ఆనందమోహన్, అధ్యక్ష కార్యదర్శులు చేవూరి దుర్గాప్రసాద్, బొజ్జ చంద్రమోహన్‌లు ఉన్నారు.

తల్లిదండ్రుల అనుమానాలు అధికారులు తీర్చాలి

ప్రజాశక్తి-కందుకూరు : బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం విమర్శలకు కేంద్రంగా మారింది. సోమవారం పరీక్ష జరుగుతున్న సందర్భంలో ఓ ప్రయివేటు వ్యక్తి సెల్ ఫోన్‌తో హల్‌చల్ చేశాడనే విమర్శలు వచ్చాయి.పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ల అనుమతి లేదని విద్యాశాఖాధికారులు స్పష్టమైన అదేశాలిచ్చారు.అలాంటిది పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకు పోయారనే అరోప ణలపై విద్యాశాఖాధికారులు స్పంది చి వాస్తవాలు ఏమిటనేది వెల్లడిస్తే బాగుం డేది.వారు స్పందిచక పోవడంతో అను మానాలకి తావిచాయి. ఒకవైపు ప్రభుత్వం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించమని, పరీక్షా కేంద్రాన్ని నో మొబైల్ జోన్ గా ప్రకటించిన సందర్భంలో అ వ్యక్తి మొబైల్ తో తిరగడం వల్ల పరీక్ష పేపర్లు లీకయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే విమర్శలున్నాయి.ఉన్నత స్థాయి అధికారులు ఈ విషయాలను పరిశీలించి, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరీక్షలు సక్రమంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలి.

రోడ్డెక్కిన విద్యుత్ మీటర్ రీడర్స్

ప్రజాశక్తి-కందుకూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు డివిజన్ లో విద్యుత్ డిపార్ట్మెంట్ లో పనిచేసే మీటర్ రీడర్స్ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయం దగ్గర మంగళవారం ఎఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై ఆనంద మోహన్ ఆధ్వర్యంలో విద్యుత్ మీటర్స్ రీడర్స్ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మీటర్ రీడర్స్ కార్యదర్శి కుంచాల సిద్ధయ్య మాట్లాడుతూ గత 10 – 15 సంవత్సరాలనుండి విద్యుత్ డిపార్ట్మెంట్లో మీటర్ రీడర్స్ గా పనిచేస్తున్నామన్నారు. ఇప్పుడుఉపాధికి ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, వాటి వల్ల తమకు ప్రమాదం పొంచి ఉందన్నారు. స్మార్ట్ మీటర్ కి సిమ్ సిస్టం పెట్టడం వల్ల నెలనెలా ప్రతి ఇంటికి తిరిగి రీడింగు తీసే పనిలేదని వాపోయారు. సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 20వ తేదీన జిల్లా ఎస్ఇ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని, 24న కలెక్టర్‌కు వినతి పత్రం, 27న సిఎండి ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం చేస్తామన్నారు.కందుకూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బి. సురేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వము తీసుకొచ్చిన స్మాట్ మీటర్ల వల్ల సంవత్సరాలుగా మీటర్ రీడర్స్ విద్యుత్ డిపార్ట్మెంట్లో సేవలందిస్తూ వచ్చారని, నేడు ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ వల్ల వీళ్ళ బతుకులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు.కార్యక్రమంలో మాలాద్రి, డి.శ్రీను, జే. రాము, టి.శివ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

శ్మశాన వాటికను కాపాడండి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని ఈదూరు గ్రామం ముస్లిములు తమ శ్మశానవాటికను కాపాడాలంటూ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముస్లిం పెద్దలు అజీజ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. వందేళ్ల చరిత్ర కలిగిన శ్మశాన వాటికకు ఎటువంటి ఆధారాలు లేవంటూ ఓ రాజకీయ పార్టీకి చెందిన కొందరు నాయకులు దురుద్దేశంతో చేస్తున్న ప్రచారాన్ని ముస్లిం పెద్దలు అజీజ్ దృష్టికి తెచ్చారు. ప్రజలు తాగే మినర ల్ వాటర్ ప్లాంట్‌ను శ్మశానంలో ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబని వారు వాపోయారు. శ్మశాన వాటికలో ఒక్క అడుగు భూమిని కూడా ఇచ్చేందుకు తాము సంసిద్ధంగా లేమని ముస్లిం పెద్దలు స్పష్టం చేశారు. అంతేకాకుండా ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేకుండా శ్మశాన వాటికను కాపాడుకొనేందుకు తాము రాజకీయాలకు అతీతంగా చేస్తున్న పోరాటానికి దురుద్దేశంతో రాజకీయ రంగు పులిమేందుకు కుట్రలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా శ్మశానవాటికను కాపాడుకొనే విషయంలో సహకరించాలని ముస్లిం పెద్దలు అజీజ్‌కు విజ్ఞప్తి చేశారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-సైదాపురం : రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం బీసీ కాపు, ఈ బిసి కమ్మ, రెడ్డి ఆర్యవైశ్య క్షత్రియ బ్రాహ్మణ కుటుంబాల మహిళలకు కార్పొరేషన్ ద్వారా టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాలు మధ్య వయసు కలిగి, తెల్ల రేషన్ కార్డు, ఆదాయ కుల ధ్రువీకరణ ఆధార్ కార్డు కలిగిన ఉండాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆయా సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటివరకు సొంత భూములున్నా ఫార్మర్స్ మాత్రమే రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యకు అవకాశం ఉందన్నారు.

మాజీ కౌన్సిలర్ రహీం మృతి

ప్రజాశక్తి-కందుకూరు: గోకరాజుపాలెంలో నివాసం ఉంటున్న తెలుగుదేశం పార్టీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎస్.కె రహీం బాషా అలియాస్ బాబు మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతిచెందాడు. 2000 సంవత్సరంలో జరిగిన కందుకూరు మున్సిపల్ ఎన్నికల్లో రహీం 16వార్డు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. రహీం పోటీ చేసిన వార్డు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలాంది.అలాంటి వార్డులో రహీం పోటీచేసి గెలవడం అప్పటిలో చర్చనీయాం శమైంది.కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, సిపిఎం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాదేళ్ల కోటేశ్వరరావు, రహీం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు.

భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పిచ్చమ్మ మృతికి నివాళి

ప్రజాశక్తి-కందుకూరు: పిచ్చమ్మ భౌతికకాయాన్ని మంగళవారం మాజీ శాసన సభ్యులు, కందుకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ సందర్శించి నివాళులర్పించారు.వైసీపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ మరణించిన విషయం తెలుసుకొని మేదరమెట్ల లో ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా ఆమె మతికి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈసంఘటన మండలంలోని పోకూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని సింగనేనిపల్లికి చెందిన బాశం దినేష్(23) బైక్‌పై బడేవారిపాళెంకు వెళుతున్నాడు.ముందు వెళుతోన్న కారును ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తోన్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ప్రమాదానికి గల కార ణాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరులోని ఏరియా ఆస్పత్రికి తరలిం చారు.ఆస్పత్రి వద్ద మృతుడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. దినేష్ మృతి వార్తతో తెలియడంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

గుడ్లూరు రూరల్‌లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్: మండలంలోని గుండ్లపాలెం, గుడ్లూరు-2 రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి బి. రవి కుమార్ అధ్యక్షతన పొలం పిలు స్తోంది కార్యక్ర మాన్ని నిర్వహించారు.వ్యవసాయ శాఖ, అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం నిర్వహించారు.

ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమలు పెట్టండి

చైర్మన్, సిఇఒతో 'వేమిరెడ్డి' భేటి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, జిల్లాలో యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పించాలని ఎంపి వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో ఇఫ్కో ఛైర్మన్ దిలీఫ్ సంఘానీ, సిఇఒ డాక్టర్ ఉదయ్ శంకర్ అవస్థినిని కలిశారు. నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ కోసం సేకరించిన 2777 ఎకరాల్లో అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం భూమిలో 1900 ఎకరాలు సెజ్ నిమిత్తం, 877 ఎకరాలు డొమెస్టిక్ టారిఫ్ ఏరియా కింద ఉందన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఐఎఫ్ఎఫ్‌సిఒ) ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన సహకార సంస్థ అని, వ్యవసాయం, ఇతర పారిశ్రామిక యూనిట్లకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఎంతో ఉపకరిస్తుందని ఎంపి వేమిరెడ్డి కోరారు. పరిశ్రమలను ప్రోత్సహించడానికి మెరుగైన నిర్వహణ దృష్టి కోసం కిసాన్ సెజ్‌ను ఇఫ్కో ప్రోత్సహిస్తు ందన్నారు. ఎంపి వేమిరెడ్డి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన వారు.. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిస్థితిని పరిశీలిస్తామన్నారు. తప్పకుం డా సెజ్ భూములను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.



సన్మానిస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు హక్కు లేని అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూపర్‌వైజర్‌లు, బూత్ లెవెల్ అధికారులను నెల్లూరు సిటీ 117 – అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సూర్య తేజ ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో నగరపాలకసంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ.ఆర్.ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపొందించ డంలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన విధి విధానాలను అనుసరిస్తూ, ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు, యాక్షన్ ప్లాన్ రూపొం దించేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ అందించి, క్షేత్ర స్థాయిలో వారి సేవలను వినియోగించుకోవాలని ఈ.ఆర్.ఓ సూచించారు.నగర పాలక సంస్థ పరిధిలోని ఓటర్లు – జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి, కొత్త ఓటర్ల నమోదు, వివిధ క్లయిముల పరిష్కారం, గత ఓటర్ల జాబితాతో నేటి జాబితా పోలిక, యువ ఓటర్ల తగ్గుదలను భర్తీ చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై ఏ.ఈ.ఆర్.ఓ లు దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఏ.ఈ.ఆర్.ఓ షఫీ మాలిక్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్, సూపర్ వైజర్లు, బిఎల్ఒ

కిడ్నీలను అశ్రద్ధ చేయొద్దు

ప్రజాశక్తి-నెల్లూరు

శరీరం మొత్తానికి ఎంతో ముఖ్యమైన రక్తాన్ని శుద్ధిచేసే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యూరాలజిస్ట్ డాక్టర్ డాక్టర్ గోకుల్ నచికేథ్ సూచించారు. ప్రపంచ కిడ్నీ మాసోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన హాస్పిటల్ లో మీడియాతో మాట్లాడారు. రక్తాన్ని వడపోసే కిడ్నీలు దెబ్బతింటే దాని ప్రభావం శరీరమంతా ఉంటుందని, వివిధ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కిడ్నీకి సమస్య తలెత్తిన వెంటనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే అవకాశం ఉందన్నారు. కాళ్లలో వాపు, నిరంతరం అలసటగా ఉండటం లాంటి లక్షణాలు కిడ్నీ వ్యాధులకు సూచికలని పేర్కొన్నారు. అనేక మందికి ఎలాంటి లక్షణాలు లేకుండా కూడా కిడ్నీ వ్యాధులు బయటపడుతున్నాయని, షుగర్ లేని వారికి కూడా కిడ్నీ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వారు కిడ్నీ రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్నవారు క్రమం తప్పకుండా కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

డబుల్ రోడ్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : ఇసుకపేట నుండి బోగోలు ఆర్‌సిఎం చర్చి వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు అధ్వాన్నంగా తయారైందని, వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి రోడ్డును డబుల్ లైన్‌గా విస్తరించాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత చంద్రబాబు హయాంలో ఇసుకపేట నుండి బోగోలు వరకు 13 కిలోమీటర్ల వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేశారని, బోగోలులో రైల్వే ఆర్‌ఒబి వంతెన నిర్మించే ఉద్దేశంతో ఇసుకపేట నుండి బోగోలు ఆర్‌సిఎం చర్చి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్నారు. ఆర్‌ఒబి నిర్మాణం జరిగేందుకు కాలయాపన జరుగుతున్న నేపథ్యంలో ఇసుకపేట, బోగోలు రోడ్డు అధ్వాన్నంగా తయారైందన్నారు. ఈ మధ్యకాలంలో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమై, భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి దృష్టి పెట్టి ఈ రోడ్డును రెండు లైన్ల రోడ్డుగా నిర్మించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు బత్తుల రవిచంద్ర, ఆరోగ్యరాజ్, షేక్ అహ్మద్ బాషా, శివ, దప్పిర శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రతిమహిళా పారిశ్రామికవేత్త కావాలి

ప్రజాశక్తి-కోవూరు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మహిళ పారిశ్రామికవేత్త కావాలనే సదుద్దేశంతో సంకల్పించిన ఒక కుటుంబానికి ఒక వ్యాపారవేత్త కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రకు సంబంధించిన డాక్టర్ ఆర్.సుజాత రెడ్డి తెలిపారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమాఖ్య మందిరంలో మంగళవారం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ భాగంగా సంకల్ప పథకంపై మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం సుబ్బరాజు, సిసిలు రామశేఖర్, శోభ, రాము, చైతన్యబాబు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షులు కల్పన, తదితరులు ఉన్నారు.

జిల్లా సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-బిట్రగుంట : నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన విజయవాడలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులు, జిల్లా సమస్యలు చర్చించారు. కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలపై కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వనమాక లక్ష్మి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, జిల్లాలోని ఎంఎల్‌ఎలు, మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బిట్రగుంట : కావలి నియోజకవర్గ టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయనకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, కావలి ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ ఓరుగంటి రామకృష్ణ, ఉపాధ్యక్షులు గాదంశెట్టి మధుసూదన్ రావు, గంగిశెట్టి నందకిషోర్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు మొగిలపల్లి రాజా, ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం సెక్రెటరీ మిద్దె ప్రతాప్ కుమార్ రాజ్ కుమార్ నివాసానికి వెళ్లి కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్ కుమార్ చౌదరి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులున్నారు.

పిచ్చమ్మకు రామిరెడ్డి నివాళులు

ప్రజాశక్తి బిట్రగుంట : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత వై.వి.సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతి చెందడంతో బాపట్ల జిల్లా మేదరమెట్లలోని వారి స్వగృహంలో ఆమె భౌతికకాయానికి మంగళవారం కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇంటికి పెద్ద దిక్కు మాతృమూర్తి లేని లోటు వారి కుటుంబానికి ఎవరు తీర్చలేనిదని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కర్రం సంపూర్ణమ్మకు నివాళులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కర్రం సురేంద్ర రెడ్డి తల్లి కర్రం సంపూర్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్రం సురేందర్ రెడ్డి కుటుంబంలో తల్లి లేని లోటు ఎవరు తీర్చలేనిదని తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో బోగోలు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు, మేకల శ్రీను, సుందర్‌రాజ్, మల్లారెడ్డి, క్యాశ్, నాయబ్ రసూల్, తోటపల్లి సాగర్, సాల్మన్ రాజ్, పాపయ్య, మండల సీనియర్ నాయకులు, నేతలు, గ్రామస్తులు తదితరులున్నారు.

ఆదరణ-3 పథకంపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదరణ-3 పథకానికి సంబంధించి బిసి సామాజిక వర్గంలోని వివిధ సాంప్రదాయక కులవృత్తులను చేపడుతున్న కులాలకు సంబంధించిన నాయకులు, పెద్దలు మొదలైన ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఇవోపిఆర్‌డి, కార్యాలయ ఎఒ, బిసి సామాజిక వర్గానికి చెందిన వృత్తిదారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ షాలెట్ మండలంలోని కులవృత్తిదారులకు ఆదరణ-3 పథకంపై అవగాహన నిర్వహించారు. కులాల వారీగా ఉపకరణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం కులవృత్తిదారులకు ఆధునిక ఉపకరణాలను అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని కులవృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇవోపిఆర్‌డి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుటుంబానికి అండగా ఉంటాం..

ప్రజాశక్తి-కలిగిరి : కలిగిరి గ్రామానికి చెందిన కర్రె.మహేష్ అనారోగ్యకారణంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కొట్టె.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి అల్లూరు రవీంద్ర, మండల కన్వీనర్ బండారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జనసైనికుడు మహేష్ కుటుంబానికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేసి, కుటుంబానికి భరోసాగా జనసేన ఉంటుందని తెలియజేశారు. మండలాల కన్వీనర్లు, నాయకులున్నారు.

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి-కోవూరు : గంగవరం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాటూరు నీటి సంఘం అధ్యక్షులు శింగారెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, గంగవరం సర్పంచ్ చిడెం లక్ష్మీకుమారి, ఎంపిటిసి శింగారెడ్డి సుమిత్రమ్మ పంచాయతీ కార్యదర్శి నాయబ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కవచాలు వితరణ

ప్రజాశక్తి కోవూరు : కోవూరులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వెలిసి ఉన్న వినాయక విగ్రహానికి పడుగుపాడు గ్రామానికి చెందిన పోలు మస్తాన్‌రెడ్డి, ఇందిరమ్మ దంపతులు సుమారు రూ.40వేలు విలువ చేసే స్వామివారికి సంబంధించిన ఇత్తడి కవచాలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజస్వామి ప్రత్యేకంగా అభినందించారు.

డ్రైనేజీ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం పాటూరు పంచాయతీ నార్నపూడిపాలెం గ్రామంలో మురుగునీరు పోయేందుకు సరైన కాలువలు లేక రహదారిలో ఈ నీరు నిస్తున్నాయని ఆ ప్రాంత వాసులు సోమవారం తహశీల్దారుకు విన్నవించారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న ఇవోపిఆర్‌డి శ్రీనివాసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఈ మురికినీరు పోయే మార్గాన్ని పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి సునీల ఉన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : నిరుద్యోగ యువతీ యువకులకు ఈ డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీసునంద తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో ఉన్న వైఆర్‌అండ్‌ఎస్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, డిసిపిఎ అబ్దుల్ ఖయ్యాలం అభినందనలు వారిని తెలియజేశారు.

కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్రలు

కావలిలో..

ప్రజాశక్తి-బిట్రగుంట

కావలి పట్టణంలో ప్రజా చైతన్య యాత్రల సందర్భంగా ఆ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని మంగళవారం సిపిఎం నాయకులు అడ్మిన్ సెక్రటరీ వినోద్ కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్ర ద్వారా సిపిఎం నాయకుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని, సచివాలయాల్లో అర్జీలు ఇచ్చినట్లు, కావలి ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావడంలేదని తాగునీరు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు పూర్తిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, పాలకులు హామీలకే పరిమితమై ప్రజలను ఇబ్బందుల్లోకి నేడుతున్నారని తెలిపారు. పట్టణంలో ప్రజలకు కరెంటు బిల్లులు, ఇంటి బిల్లులు, నీటి బిల్లులు చాలా ఎక్కువ వచ్చాయని, గతంలో వీధి కొళాయిలు తొలగించి ప్రభుత్వమే బిపిసిఎల్ పేరుతో ప్రతి ఇంటికి కనెక్షన్ అని చెప్పి ఇళ్లలో కొళాయిలు వేసిందని, ఇప్పుడు సంవత్సరాల అప్పు కట్టాలని వేల రూపాయలు ప్రజలపై భారం వేసిందని తెలిపారు. ఒక్కసారిగా ఎక్కువ మొత్తం కట్టాలంటే సామాన్యులు కట్టలేని పరిస్థితిలో ఉన్నారని, ఇంటి పన్నులు కూడా పెంచిందని, కరెంటు బిల్లులు విపరీతంగా సగానికి సగం పెరిగాయని, ఇది చాలా అన్యాయమని ప్రభుత్వం పెంచిన బిల్లులపై ప్రభుత్వ అధికారులు పరిశీలన చేసి ఎక్కువ బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎక్కువ బిల్లులతో ప్రజలను ఇబ్బందులు గురి చేసే ఆలోచన అధికారులు, ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్, బి.కృష్ణయ్య, జి.మధుసూదన్ రావు, సిపిఎం సీనియర్ నాయకులు రమణయ్య, బంగారయ్య, సిపిఎం నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై మంగళవారం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం బోగోలు మండల కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరి మాల్యాద్రి, సిపిఎం మండల శాఖ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, మండల సిఐటియు కార్యదర్శి చల్ల నరహరి బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలో ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్య పరుస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోవడంలో విఫలమయ్యాయని, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ధరలను అదుపు చేయడంలో విఫలమైందని తెలిపారు. బోగోలు మండలంలో మొత్తం 16 పంచాయతీల్లో రెండు మేజర్ పంచాయతీలైన విశ్వనాథరావుపేట బోగోలు గ్రామాల్లో కనీసం వారానికి ఒక్కసారి కూడా కాలువలు తీయక పోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, ఈ మధ్యకాలంలో ఎక్కువగా జ్వరాలతో ప్రజలు హాస్పిటల్ చుట్టూ తిరిగి జేబులు ఖాళీ చేసుకున్నారని, సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి కాలువలు పూడికలు తీసి దోమలబార్ నుండి ప్రజలను కాపాడాలని తెలిపారు. బిట్రగుంటలో రైల్వే భూమి వందల ఎకరాలు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, బిట్రగుంటలో ఒక చిన్న రైల్వే కర్మాగాంధీ నిర్మిస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా రెండు వేలమందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. బోగోలు మండలంలో మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, మంచినీటి కోసం సుందరగిరి వారి కండ్రిక నుండి పైప్‌లైన్ల పనులను 80శాతం పని పూర్తి చేశారని, 20శాతం పని పూర్తి చేస్తే బోగోలు మండల ప్రజలు దాహార్తి తీర్చిన వారవుతారని తెలిపారు. జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ పనులు కూడా 80శాతం పూర్తిచేసి 20శాతం పెండింగ్లో ఉండి పోయాయని, వాటిని కూడా ప్రభుత్వం త్వరగా పూర్తిచేస్తే ఎగుమతులకు బిట్రగుంట రైల్వే పరంగా ఉపయోగపడుతుందని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని, చెప్పి ఇప్పుడు అధిక మొత్తంలో సబ్ ఛార్జీల పేరుతో అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అర్హత లేని వారు తెల్ల రేషన్ కార్డు ,పెన్షన్ పొందుతున్నారని, అర్హత కలిగిన వారికి పూర్తిస్థాయిలో ఈ ప్రభుత్వం న్యాయం చేయడం లేదని అర్హులని గుర్తించి ప్రభుత్వ నుండి వచ్చే పథకాలను వారికి అందించాలని తెలిపారు. కోవూరు పల్లిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బోగోలు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే పేదలకు, మధ్యతరగతి కుటుంబం వారికి ఉపయోగపడుతుందని, ప్రభుత్వం ఆరోగ్య కేంద్రంలో పరికరాల కొరత లేకుండా చూడాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, సబ్సిడీ రుణాలను బ్యాంకుల ద్వారా అందించి వారికి చేయూత ఇవ్వాలని తెలిపారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తుందని, కార్పొరేట్ సంస్థలు బ్యాంకులో రుణాలు తీసుకొని ఎగవేస్తే వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా రుణమాఫీ చేయడం ఎంత వరకు సబబు అని, చిన్నకారు రైతు బ్యాంకులో రుణం తీసుకుంటే రుణం చెల్లించడంలో ఆలస్యం అయితే బ్యాంకు వారు ఇంటికి వచ్చి మరి వసూలు చేసుకుంటున్నారని, రైతే దేశానికి వెన్నుముక అని చెప్పిన కేంద్రం రైతులను, పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో..

ప్రజాశక్తి-ముత్తుకూరు : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని పిడతపోలూరు సచివాలయం దగ్గర సిపిఎం నాయకులు మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు పాల్గొని ఈ పంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. గిరిజనులైన వారికి గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేసి మధ్యలోనే ఆగిపోయిన వాటిని తిరిగి నిర్మించుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.75వేలను వారికి అందించాలని ఎస్‌సిలకు రూ.50వేలు అందించాలని వారు అధికారులను కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ఆముదాలపాడు రెవెన్యూలోని సీతారెడ్డి తోపులో 84ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని లబ్ధిదారులందరినీ అడంగల్ లో నమోదు పరిచి పట్టాదార్ పాస్ పుస్తకాలను మంజూరు చేయాలని గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలపై న్యాయ విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌సా మాట్లాడుతూ సోయిందమ్మ పాలెంలో డ్రెయినేజీ కాలువల్లోని మురుగు నీటిని తొలగించేందుకు డ్రెయినేజీ కాలవలను కిందికి తీసుకోపోవాలని డ్రెయినేజీ కాలవపై మూతలు వేయాలని ఇళ్ల స్థలాలు లేనివారికి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు బ్రహ్మదేవి మోహన్ రావు మాట్లాడుతూ సీతారెడ్డి తోపులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని పెండింగ్‌లో ఉన్న మత్స్యకార ప్యాకేజీ బ్యాలెన్స్ రూ.18050 వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం పిడతాపోలూరు నాయకులు చేంతాటి రవి మాట్లాడుతూ సచివాలయం వెనుక వైపు ఉన్న కాలనీలో మట్టి లెవెలింగ్ చేయాలని డ్రెయినేజీ కాలువల నిర్మించాలని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పొల్యూటర్స్ పేప్యాకేజీ నేలటూరుపాళెంకు ఇస్తున్న విధంగా కుటుంబానికి 25 కేజీల బియ్యం మూడు వేల రూపాయల నగదును పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పైసమస్యల పరిష్కరించేందుకు సచివాలయం కార్యదర్శికి, విఆర్‌ఒకు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో నెల్లూరు సుధాకర్, వెంకటేశ్వర్లు, షేక్ ఇమామ్ సాహెబ్, పెద్దపూడి వెంకయ్య, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం పట్టణం గుడిపల్లి కాలువ సమీపంలోని సుధాకర్ కాలనీలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 2వ రోజు సిపిఎం పట్టణ అధ్యక్షులు పోతంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలనీలోని 15 కుటుంబాలకు మంగళగట్ట జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు కాగా అవి స్లాబ్ వరకే పరిమితమై ఉన్నాయని బాధితులు తెలియజేశారన్నారు. ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకొని ఆ కుటుంబాలకు వీలైనంత త్వరగా వారికి మంజూరైన ఇళ్లను పూర్తిచేసి అందించాలని సిపిఎం తరపున ఆయన డిమాండ్ చేశారు. మంగళగట్ట జగనన్న కాలనీలో నివాసముంటున్న వారికి తాగునీటి సమస్య లేకుండా చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్‌కె.జానీభాషా, ఎస్‌కె మున్నీర్, డివైఎఫ్ఐ నాయకులు కోటయ్య, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వింజమూరులో..

ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరు పంచాయతీ పరిధిలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం జగనన్న ఇళ్ల స్థలాలను సిపిఎం మండల కన్వీనర్ ఎం.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్‌ఆర్‌జిఎస్ నిధులను కాలనీలకు జమ చేస్తామంటూ లబ్ధిదారులకు ఇంతవరకు ఇవ్వలేదని అలాగే కాలనీలలో పూర్తిస్థాయి పేమెంట్లను గవర్నమెంట్ చెల్లించాలని ఎన్‌ఆర్‌జిఎస్ నిధులను లబ్ధిదారుల ఖాతాకు జమ చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని దినాలను కల్పించాలని రోజుకు రూ.300 కూలీ తగ్గకుండా ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన పేద బలహీన వర్గాల ప్రజలందరూ కలిసి ప్రజా పోరుయాత్రతో పోరాటాలకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో గుజ్జుల మల్లికార్జున, పి.బయన్న, స్వాముల నాగేశ్వరరావు, రమణారెడ్డి, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

టిపిగూడూరులో..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని మల్లికార్జునపురం గిరిజన కాలనీలో శాఖ కార్యదర్శి కాల్తీరెడ్డి రవణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పచ్చ మధులు పాల్గొని మాట్లాడుతూ గిరిజనులకు ఇచ్చిన 100 జగనన్న గృహాలు అసంపూర్తి నిర్మాణంతో నిరుపేదలు ఇళ్లలోకి చేరలేని పరిస్థితి నెలకొందన్నారు. నిరుపేద గిరిజనులకి ఉపయోగకరమైన గవర్నమెంట్ 4 పడకల హాస్పిటల్ నిర్మాణ దశలోనే ఆగిపోయిందని విమర్శించారు. గిరిజనులకు ఇప్పటి వరకు రేషన్‌కార్డులు కూడా లేవన్నారు. వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేగూరు వెంకయ్య, బాట పెంచలయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల 11వ రోజు పర్యటనలో భాగంగా మండలంలోని పాత వెల్లంటి గ్రామంలోని ఆర్ఓ వాటర్ ప్లాంటును, ఉపాధి హామీ పనులను, ధాన్యం కల్లాలను పరిశీలించారు. ఈ పర్యటనలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరి తిరుపాలు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పనులకు పోతున్న కూలీలకు తక్కువ కూలి వస్తుండడంతో కూలి గిట్టుబాటు కావడం లేదని పని దినాలను పెంచి రూ.600 వేతనం ఇవ్వాలని అలాగే రైతులు పండించిన ధాన్యానికి ఆరబోసుకునేందుకు కల్లాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అందడం లేదని కాబట్టి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, మండల కమిటీ సభ్యులు ఎంవి రమణ, నాయకులు శ్రీపతి వెంకయ్య, వన్నం రామచంద్రయ్య, శ్రీపతి వెంకట శేషయ్య, పాదర్తి మధు, పాదర్తి చిరంజీవి, పాదర్తి అంజయ్య, శ్రీపతి వెంకటేశ్వర్లు, సిహెచ్ ఆదిశేషయ్య సుబ్బరాయులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందిపై వేటు

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగా భవాని

మండల పరిధిలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండలంలో రూ.14 కోట్లు పనులకుగా రూ.37,80,596 రికవరీతో 16మంది ఉపాధి సిబ్బందిపై జిల్లా డ్వామా పీడీ గంగాభవాని వేటు వేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రజా బహిరంగ సామాజిక తనిఖీలు భాగంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రూ.93 లక్షల విలువ చేసే రికార్డులు మాయమవ్వడంపై సంబంధిత సిబ్బందిపై పోలీస్ కేసు నమోదు చేయాలని ఎంపిడిఒ అప్పాజీను ఆదేశించారు. అనంతరం అవినీతి, రికార్డులు మాయం, అలసత్వంపై ఒక ఎపిఒతో సహా 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 3 టెక్నికల్ అసిస్టెంట్లు, 2 కంప్యూటర్ ఆపరేటర్లను సస్పెండ్ చేశామన్నారు. 17 పంచాయతీలోని రికవరీ వెంటనే చేసేందుకు సంబంధిత సిబ్బందికి త్వరలోనే నోటీసులు జారీ చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు రికవరీ వసూలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని త్వరలోనే సంబంధిత సిబ్బందికి నోటీసులు అందజేసి రికవరీ చేపడుతామన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, సీనియర్ కంట్రోల్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఎంపిడిఒ అప్పాజీ, ఎపిఒ శ్రీనివాసులు, పిఆర్ ఎఇ శ్రీనివాసరాజు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమాలను వెలికి తీయాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో భూ కొనుగోలు పథకం ద్వారా కొనుగోలు చేసిన 90 ఎకరాల భూ అక్రమాలను వెలికి తీసి ఎస్‌సిలకు ఇవ్వాలని లేనిపక్షంలో శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అధికారులను హెచ్చరించారు. మంగళవారం కావలి పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో ఆయన బాధితులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ విడవలూరు మండలంలోని ఊటుకూరు దళితవాడ కాపురస్తులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 2018 సంవత్సరంలో సర్వేనెంబర్ 1288, 1294 మొత్తం 90 ఎకరాల 86 సెంట్లు భూమిని 91మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇవ్వడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ఆ భూమిని అల్లూరు సబ్ రిజిస్టర్ ఆఫీసులో కూడా రిజిస్ట్రేషన్ చేసుకుని ఏడు కోట్ల 49 లక్షల 50వేల 500 రూపాయలు రైతులకు కూడా చెల్లించారని తెలిపారు. కానీ అప్పటినుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సర్వే చేసి ఆ భూములను దళితులకు చూపించలేదని తెలిపారు. రైతుల దగ్గర నుంచి భూములు కొనుగోలు చేసినా తిరిగి ఆ రైతులే సాగు చేసుకుంటున్న పరిస్థితి అక్కడ ఉందన్నారు. కానీ రెవెన్యూ అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా రైతులతో కుమ్మక్కై, ఎస్‌సిల కోసం కొనుగోలు చేసిన భూములను ఇప్పటి వరకు చూపించలేదని తెలిపారు. అయితే ఎస్‌సి కార్పొరేషన్ వారు లబ్ధిదారులకు ఇచ్చిన భూములు తాలూకా డబ్బులు కట్టమని ఒత్తిడి తీస్తున్నారని అటు డబ్బులు కట్టలేక, ఇటు భూములు స్వాధీనం చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా సదరు భూమిని సర్వే చేసి ఎస్సీలకు పంచి పెట్టాలని లేనియెడల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి నాయకులు రెబ్బా పాపారావు, అద్దంకి కార్తీక్, జరుగుమల్లి విజయరత్నం, జడ్డా వాసు పాల్గొన్నారు.

శివయ్యస్వామి ఎన్నిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడుగా మేళ్లచెరువు శివకుమార్ శర్మను రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంతకల్లులో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఈ మేరకు మెళ్ళచెరువు శివకుమార్ శర్మను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సంఘం ద్వారా ఆత్మకూరు పరిధిలోని 11 మండలాల్లోని బ్రాహ్మణులకు వివిధ సేవా కార్యక్రమాలు శివ కుమార్ శర్మ చేస్తున్నారు. మేళ్లచెరువు శివకుమార్ శర్మ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వడంపై పలువురు అభినందించారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : 25 సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ రీడర్స్‌గా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం భద్రత కల్పించాలని మీటర్ రీడర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బత్తుల రవిచంద్ర పేర్కొన్నారు. విద్యుత్ మీటర్స్ లీడర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వారి సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం తెలిపేందుకు మంగళవారం కావలి విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో డిఇ బెనర్జీకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బత్తుల రవిచంద్ర మాట్లాడుతూ 25యేళ్లుగా విద్యుత్ శాఖలో మీటర్ రీడర్స్‌గా పనిచేస్తున్నామని, రాష్ట్రం మొత్తం మీద 4500 మంది పనిచేస్తున్నారని, ఉద్యోగ భద్రత కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఫలితం శూన్యమని, పని దినాలు తగ్గించారని తీసి రేటు కూడా తగ్గించారని తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమను ఆదుకుంటామని చెప్పి పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వంలో అయినా మేలు జరుగుతుందనుకుంటే స్మార్ట్ మీటర్‌ను తీసుకొని వచ్చి తమ జీవనోపాధిపై దెబ్బతీస్తుందని వాపోయారు. విద్యుత్ మీటర్ రీడర్స్ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకొని విద్యుత్‌శాఖలో కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ ఉద్యోగులు మద్దిల ప్రసాద్, రఫీ, శివకుమార్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ప్రాజెక్టులు పూర్తి

ప్రజాశక్తి-వరికుంటపాడు

మాట్లాడుతున్న వితపు బాలసుబ్రహ్మణ్యం

ఉద్యమాలతోనే మెట్టప్రాంతానికి జలాలు రావడానికి సాధ్యమవుతుందని మాజీ ఎంఎల్‌సి వితపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కనియంపాడులో ఉన్న మనసు ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సీతారామ్ సాగర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాని కోరుతూ వెలుగొండ జలాల ప్రాజెక్టు సాధన సమితి ఉద్యమ నేతలు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి, సాగునీరు, తాగునీరు కావాలన్నా, వలసలు నివారించేందుకు పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సీతారాం సాగర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని, గండిపాలెం రిజర్వాయర్ పంట కాలువలు పూర్తి సాగు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకు ప్రభుత్వం తగిన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి పనులు పూర్తి చేయాలని కోరారు. దశాబ్దాల దరిద్ర్యాన్ని తరిమికొట్టే ఏకైక మార్గం ప్రాజెక్టులను పూర్తి చేయడమే అన్నారు. అలాగే 23న ఉదయగిరిలో జరిగే నెల్లూరు జిల్లా సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సమితి జనరల్ సెక్రెటరీ శ్యామ్ ప్రసాద్, సీనియర్ ఉద్యమ నేత మాల కొండయ్య, సమితి సభ్యులు హరి నారాయణ, ఆది నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రైతులకు సరైన గిట్టుబాటు ధర అందించడంలో ఎంతో కృషి చేసిన తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లను రైతులు సన్మానించారు. బుచ్చిరెడ్డిపాలెం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు స్థానిక తాశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకం గా ఆయనను కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం రైతుల మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాక ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసేలా సహకరించినందుకు తహశీల్దార్‌ను సన్మానించినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు కోటంరెడ్డి సురేష్ రెడ్డి, బొర్రు రాము, చిలకపాటి అంకయ్య తదితరులున్నారు.

సరస్వతి దేవి విగ్రహం అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరులోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న ఎపిఆర్ గురుకుల పాఠశాలకు సరస్వతి దేవి విగ్రహాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎపిఆర్ గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉదయగిరి బాలకృష్ణ ప్రకటన ద్వారా తెలియజేశారు. గతంలో తమ ఎపిఆర్ గురుకుల పాఠశాల విద్యాలయానికి ఎన్నో అభివృద్ధి పనులను చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గత నెల వాటర్ ప్లాంట్ ఓపెనింగ్ కార్యక్రమానికి విచ్చేసి పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, పాఠశాల పిల్లలు సరస్వతి దేవి విగ్రహాన్ని అందించమని కోరగా సంతోషంగా వారు ఈనాడు స్వయంగా ఆర్లగడ్డలో విగ్రహాన్ని చేయించి తమ పాఠశాలకు పంపించారన్నారు. ఆనం రామనారాయణరెడ్డికి తమ పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

CHANGE OF SURNAME

I THATHA ANUSHA (Before Marriage) wife of AITA SUDHEER KUMAR Resident of Flat No.104, Sri Sai Towers, Old Sivalayam Street, KAVALI Town, SPSR Nellore Dist. A.P. hereby declare that I have changed my Surname as

AITA ANUSHA

(After Marriage)
Henceforth, I will be known as
AITA ANUSHA

వంట పొలాల్లో లారీ బోల్తా..

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి ఆత్మకూర్ అర్బన్

ఆత్మకూరు పట్టణ సమీపంలోని అనంతరాయుని యేనికు వెళ్లే దారిలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ధాన్యం తరలిస్తున్న లారీ పంట పొలాలలో పడిపోయింది. రోడ్డు కుంగిపోవడంతో ధాన్యం తరలిస్తున్న లారీ అదుపుతప్పి పంట పొలాలలో పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు కావడంతో హాస్పిటల్‌కు తరలించారు. లారీలో ఉన్న వడ్ల బస్తాలన్నీ పొలాలలో పడిపోయాయి. కింద పడిపోయిన వడ్ల బస్తాలను మరో లారీలో లోడ్ చేసి మిల్లుకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందెం స్థావరంపై దాడి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ఖాదర్‌పూర్ పరిసరాలలో కోడి పందెం స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో వ్యక్తిని అదుపులోనికి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుండి మూడు కోళ్లు, రూ.300ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం తాళ్ళూరు గ్రామ సమీపం వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై పడి ఉన్న ఇరువురిని స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా కావలి ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారు జలదంకి మండలం బ్రాహ్మణక్రాకకు చెందిన వారిగా స్థానికులు గుర్తించారు.

Before The District Consumer Disputes Redressal Commission : Nellore

C.C.No. 125/ 2024

Mavilla Kaveri - Complainant
Vs
1. **M/s. TVS Motor Company,**
Rep.by its Managing Direcotr,
Post Box No.4, Haritha, Hosur -635109,
Krishnagiri District, Tamilnadu, India.
and 3 others - Opposite Parties

Notice to 3nd Opposite Partie

Sri. Sindhu Motors,
Rep.by its Manager, Opp. RTC Bus stand, Jonnawada Road Centre, Bombay Road, Buchireddypalem Village & Mandal, SPSR Nellore District - 524 305.

పై నెంబరున కంప్లయినెంట్ మీ మీద C.C.No. 125/2024 దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే02-04-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన నెల్లూరు జిల్లా వినియోగ దారుల ఫోరంలో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్.వెంకటేశ్వర రావు, బి.ఎ.ఎల్., బి.ఎల్.,
ఇ.రేవతి, బి.ఎ., బి.ఎల్.,
కంప్లయినెంట్ తరపు అడ్వకేట్స్, నెల్లూరు.